వాయిస్ ఆఫ్
# వందే భారత్
Voice of Vande Bharath
TGTEL/25/A4812
తెలుగు దినపత్రిక
సంపుటి : 01| సంచిక : 55 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ శనివారం | జూన్ 06, 2026

## ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం

- పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం
- ఐటీ కారిడార్, ప్రధాన రహదారులపై స్తంభించిన ట్రాఫిక్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** భాగ్యనగరంలో శనివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో అల్లాడిపోయిన నగరవాసులకు ఆకస్మికంగా కురిసిన భారీ వర్షం పెద్ద ఉపశమనాన్ని కలిగించింది. నగరంలోని మెజారిటీ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడటంతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయి వాతావరణం పూర్తిగా చల్లబడింది. నగరంలోని పంజాగుట్ట, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి, ఐటీ కారిడార్ పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అలాగే ఖైరతాబాద్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, నిజాంపేట, శంషాబాద్, రాజేంద్రనగర్, గోల్కొండ ప్రాంతాల్లోనూ మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో నగరమంతా తడిసిముద్దయింది.

( మిగతా వివరాలు 2వ పేజీలో.. )

## అష్టదరిద్రులు అడ్డంపడ్డా
# అభివృద్ధి ఆగదు



2లో..

- సీఎం రేవంత్ రెడ్డి
- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- కోహెడ అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన

**రంగారెడ్డి, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా, ఎవరెంత ఏడ్చినా అభివృద్ధి పనులను ఆపే ప్రసక్తే లేదని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు అభివృద్ధి నిరోధక శక్తులుగా మారాయని, కాళ్లల్లో కట్టెలు పెట్టాలని చూసినా ప్రజా ప్రభుత్వం వెనక్కి తగ్గదని హెచ్చరించారు. శనివారం రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.2,284 కోట్ల అంచనా వ్యయంతో 239 ఎకరాల్లో నిర్మించనున్న అంతర్జాతీయ స్థాయి సమీకృత పండ్ల మార్కెట్‌తో పాటు, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కాంప్లెక్స్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్నారు

- కల్వకుంట్ల కవిత
- భూదందాలో సీఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు
- పేదల ఇళ్లు కూల్చి కార్పొరేట్లకు కట్టబెడుతున్న 'హైడ్రా'
- పవన్ కల్యాణ్ 'శిఖం' భూములను వెనక్కి ఇచ్చేయాలి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజం



2లో..

## 'స్త్రీ రైడ్' ప్రాజెక్టు ప్రారంభం

- రవాణా, డెలివరీ రంగాల్లోకి మహిళా డ్రైవర్లు
- తొలి విడతలో 55 మందికి శిక్షణ, డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ
- మహిళా సాధికారతకు తెలంగాణ పోలీస్ శాఖ వినూత్న శ్రీకారం
- ఈ-బైక్స్, ఈ-ఆటోలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఇప్పటివరకు పురుషులకే పరిమితమైన గిగ్ వర్క్ రంగంలోకి ఇకపై మహిళలు కూడా భారీగా అడుగుపెట్టబోతున్నారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఆత్మవిశ్వాసం, భద్రతను పెంపొందించడమే ధ్యేయంగా తెలంగాణ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్, రాష్ట్ర రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన వినూత్న ప్రాజెక్ట్ 'స్త్రీ రైడ్' ను హైదరాబాద్‌లో ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలు స్వయం ఉపాధి సాధించేలా రవాణా, డెలివరీ సేవల కోసం కేటాయించిన ఈ-బైక్స్, ఈ-ఆటోలను డీజీపీ జెండా ఊపి ప్రారంభించారు. తొలి విడత కింద ఎంపిక చేసిన 55 మంది మహిళలకు అంబర్‌పేట పోలీస్ లైన్స్‌లో టూ వీలర్, త్రీ వీలర్ డ్రైవింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఈ మహిళా రైడర్లకు డీజీపీ చేతుల మీదుగా డ్రైవింగ్ లైసెన్సులు అందజేశారు. ( మిగతా వివరాలు 2వ పేజీలో.. )

## వర్షాకాలం వస్తోంది జాగ్రత్త



- కలెక్టర్లకు సీఎస్ ఆదేశాలు
- ముందస్తు చర్యలు చేపట్టాలి
- సీఎం జిల్లాల పర్యటనలపై ప్రత్యేక సమీక్ష
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో మరియు భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగమంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు రక్షణ చర్యలకు సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు. శనివారం సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో సీఎస్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి ధాన్యం కొనుగోళ్లు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.

( మిగతా వివరాలు 2వ పేజీలో.. )

# 'స్త్రీ రైడ్' ప్రాజెక్టు ప్రారంభం

- రవాణా, డెలివరీ రంగాల్లోకి మహిళా డ్రైవర్లు
- తొలి విడతలో 55 మందికిశిక్షణ, డ్రైవింగ్ లైసెన్సుల పంపిణీ
- మహిళా సాధికారతకు తెలంగాణ పోలీస్ శాఖ వినూత్న శ్రీకారం
- ఈ-బైక్స్, ఈ-ఆటోలను ప్రారంభించిన డీజీపీ సీవీ ఆనంద్

**(మొదటి పేజీ తర్వాత..)** అత్యవసర పరిస్థితుల్లో ప్రయాణించే మహిళలకు సురక్షితమైన రవాణా సేవలు అందించడంతో పాటు, జొమాటో, స్విగ్గీ, అమెజాన్ వంటి ప్రముఖ సంస్థల డెలివరీ సేవల్లో వీరు భాగస్వాములు కానున్నారు. రాబోయే నాలుగు నెలల్లో ఈ మహిళా రైడర్ల సంఖ్యను మరింత పెంచాలని అధికారులను డీజీపీ ఆదేశించారు. "దేశ జీడీపీ (గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్) వేగంగా పెరగాలంటే మహిళలు కూడా పురుషులతో సమానంగా ధైర్యంగా బయటకు వచ్చి పని చేయాలి. తెలంగాణ ప్రభుత్వం 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా మహిళా సాధికారతకు పూర్తి మద్దతు ఇస్తోంది. గతంలో హైదరాబాద్ సిటీ పోలీస్ చరిత్రలోనే లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్‌కు మహిళా ఎస్‌హెచ్‌వోలు ఉండేవారు కాదు. నేను హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడు ఆ విధానాన్ని మార్చి, మహిళా ఇన్‌స్పెక్టర్లను ఎస్‌హెచ్‌వోలుగా నియమించాను. ఇప్పుడు రవాణా రంగంలోనూ మహిళలు చరిత్ర సృష్టించబోతున్నారు." అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఈ 'స్త్రీ రైడ్' ప్రాజెక్టు ద్వారా ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్యాసింజర్ రవాణా సేవలు అందుబాటులోకి వచ్చాయని, భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అంతటా విస్తరిస్తామని డీజీపీ తెలిపారు. రాబోయే రోజుల్లో లాజిస్టిక్స్, కార్గో, కొరియర్ డెలివరీ సర్వీసుల్లో కూడా మహిళా డ్రైవర్లకు విస్తృత అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విమెన్ సేఫ్టీ వింగ్ ఉన్నతాధికారులు, రవాణా శాఖ ప్రతినిధులు మరియు మహిళా రైడర్లు పాల్గొన్నారు.

# అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు

- సీఎం రేవంత్ రెడ్డి
- ఎవరెంత ఏడ్చినా.. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మిస్తాం
- వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం
- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి
- కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది
- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం
- ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం
- కోహెడ అంతర్జాతీయ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపన



**(మొదటి పేజీ తర్వాత..)** గత ప్రభుత్వాల హయాంలో 'వరి వేస్తే ఉరి' అనే దారుణ పరిస్థితులు ఉండేవని, కానీ తమ ప్రభుత్వంలో ఆ రోజులు పోయాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వరి పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తూ వ్యవసాయాన్ని పండగలా మారుస్తున్నామని చెప్పారు. "గతంలో ఎక్కడ చుక్క నీరున్నా అది కాళేశ్వరం నీళ్లే అంటూ భారీగా ప్రచారం చేసుకున్నారు. లక్షల కోట్లు వెచ్చించి కట్టిన కాళేశ్వరం చివరకు 'కూలేశ్వరం' అయింది. కానీ, ఈరోజు చుక్క నీరు ఎత్తిపోయకుండానే రాష్ట్రంలో లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండలేదా?" అని సీఎం ప్రశ్నించారు.

### కేంద్రం దిగిరాకుంటే మోదీ సంగతి తేలుస్తాం!

తెలంగాణలో పండిన ధాన్యమంతా కొనుగోలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీఎం స్పష్టం చేశారు. ఈ నెల 15 తర్వాత కూడా కేంద్రం వడ్లు కొనకపోతే ఢిల్లీ వేదికగా ప్రధాని మోదీ సంగతి తేలుస్తామని హెచ్చరించారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తేవాల్లో తమకు బాగా తెలుసన్న రేవంత్.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు మర్యాద తప్పితే పొలిమేరలు దాటనివ్వబోమని హెచ్చరించారు. భవిష్యత్తులో రాహుల్ గాంధీని ప్రధానిని చేసి, తెలంగాణ ధాన్యాన్ని పూర్తిగా కేంద్రంతోనే కొనిపిస్తామని, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### వినాశనం నుంచి వికాసం వైపు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో శతాబ్దానికి సరిపడా విధ్వంసాన్ని సృష్టించిందని సీఎం మండిపడ్డారు. చెడిపోయిన 'కారు' (బీఆర్‌ఎస్ గుర్తు) ప్రస్తుతం కార్ఖానాలో ఉందని, దానికి ఎన్ని మరమ్మతులు చేసినా ఇక పనికిరాదని ఎద్దేవా చేశారు. తాము అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్‌ఎస్ నేతలు అనడం వారి అహంకారానికి నిదర్శనమన్నారు. కాలుష్యాన్ని వెదజల్లే ఫార్మా సిటీని రద్దు చేసి, ప్రపంచ స్థాయి 500 గ్రీన్ కంపెనీలతో 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నామని తెలిపారు. దీనివల్ల మరియు కోహెడ మార్కెట్ వల్ల ఏటా రూ.8 వేల కోట్ల అదనపు ఆదాయం సమకూరుతుందని వెల్లడించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు, ఆర్‌ఆర్‌ఆర్ వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకుంటూ అష్టదరిద్రులు ధర్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 2034 వరకు ప్రజాపాలనే ఉంటుందని, 'ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్' అన్నదే తమ నినాదమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్నారు

- కల్వకుంట్ల కవిత
- భూదందాలో సీఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు
- పేదల ఇళ్లు కూల్చి కార్పొరేట్లకు కట్టబెడుతున్న 'హైడ్రా'
- పవన్ కల్యాణ్ 'శిఖం' భూములను వెనక్కి ఇచ్చేయాలి
- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ధ్వజం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కార్పొరేట్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. శనివారం ఆమె హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న భూదందాలో ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు చురుగ్గా పాల్గొంటున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ దోపిడీ నుంచి ప్రభుత్వ భూములను కాపాడేందుకు అవసరమైతే సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడతామని ఆమె స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెప్పుకుంటున్న 'హైడ్రా' కేవలం పేదల కాలనీలపై దాడులు చేయడానికే పరిమితమైందని కవిత విమర్శించారు. పేదల ఇళ్లను కూల్చేసి, ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే హైడ్రాను వాడుకుంటున్నారని ఆరోపించారు. "శ్రీ ఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పై అక్రమంగా ప్రాజెక్టు కడుతోంది. ఆ కంపెనీ వెనుక అధికార పార్టీకి చెందిన ఒక ఎంపీ ఉన్నారు. గత బీఆర్‌ఎస్ హయాంలోనే దానికి పర్మిషన్ ఇచ్చారని ప్రచారం చేస్తున్నారు.. మరి ఆ అక్రమ కట్టడాన్ని ముట్టుకునే దమ్ము, ధైర్యం ఈ రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఉందా?" అని కవిత సవాల్ విసిరారు. రాష్ట్రంలో గతంలోనూ, ఇప్పుడు కూడా 'కేటీఆర్' పాలనే నడుస్తోందని కవిత ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "గతంలో కేటీఆర్ అంటే.. కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, కల్వకుంట్ల రామారావు అని అర్థం. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ మార్క్ కేటీఆర్ అంటే.. కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని అర్థం" అంటూ ఆమె ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి నీటి ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని విమర్శించారు. ఏపీ సీఎంతో మాట్లాడి తెలంగాణకు రావలసిన 200 టీఎంసీల నీళ్లను సాధించిన తర్వాతే బనకచర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడాలని హితవు పలికారు. "తెలంగాణ బరాబర్ ఇక్కడి ప్రజల జాగీరే.. అంతే తప్ప జనసేన అధినేత పవన్ కల్యాణ్ జాగీర్ కాదు. ఆంధ్రా విషకోరల నుంచి ఎంతో పోరాడి తెలంగాణను కాపాడుకున్నాం. ఇక్కడికి వచ్చి మళ్లీ ఆంధ్రా నేతలు రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోం. పవన్ కల్యాణ్ కోడికుంట సర్వే నంబర్ 706లో 10 ఎకరాల 'శిఖం' భూమిని అక్రమంగా కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయి. ఆ శిఖం భూమిని పవన్ తక్షణమే ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేయాలి, అక్కడ వేసిన కంచెను తొలగించాలి." అని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్‌ను నమ్ముకుంటే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని, కానీ వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 అసెంబ్లీ సీట్లు కూడా ఊడిపోవడం ఖాయమని కవిత జోస్యం చెప్పారు. కాంగ్రెస్, బీజేపీలు పరస్పరం చేసుకుంటున్న నకిలీ సవాళ్లతో తెలంగాణ ప్రజలకు ఒరిగేదేమీ లేదని ఆమె స్పష్టం చేశారు.

# ఒక్కసారిగా చల్లబడ్డ వాతావరణం

- పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- ఉక్కపోత నుంచి నగరవాసులకు ఉపశమనం
- ఐటీ కారిడార్, ప్రధాన రహదారులపై స్తంభించిన ట్రాఫిక్

**( మొదటి పేజీ తర్వాత.. )** వేసవి వేడితో ఇబ్బంది పడుతున్న జనాలకు ఈ వర్షం ఎంతో ఆహ్లాదాన్ని పంచింది. సాయంత్రం కార్యాలయాల నుంచి ఇళ్లకు తిరుగు ప్రయాణమయ్యే సమయంలో వర్షం పడటంతో ఐటీ ఉద్యోగులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా హైటెక్ సిటీ, గచ్చిబౌలి, పంజాగుట్ట, బంజారాహిల్స్ ప్రధాన రహదారులపై వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. రోడ్లపై నీరు చేరడంతో ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని సమీక్షిస్తూ, వాహనదారులు వీలైతే ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సూచించారు. "హైదరాబాద్‌తో పాటు పరిసర జిల్లాల్లో మరికొన్ని గంటల పాటు ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదు. లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచిన రోడ్లపై ప్రయాణించేటప్పుడు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి." అని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్ సిబ్బంది కూడా రంగంలోకి దిగి రోడ్లపై నిలిచిన నీటిని తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. తాజా వర్షంతో నగరంలో ఎండ తీవ్రత తగ్గి, రాత్రి వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.

# వర్షాకాలం వస్తోంది జాగ్రత్త

**( మొదటి పేజీ తర్వాత.. )**

రాష్ట్రంలో రాబోయే రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలపై సీఎస్ ప్రత్యేకంగా చర్చించారు. వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలన్నారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలను గుర్తించి, అక్కడ ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్లను ఆదేశించారు. ఏ క్షణంలోనైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే తక్షణమే స్పందించేలా విపత్తు నిర్వహణ, రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ తదితర అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. రైతులకు నష్టం కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని సీఎస్ మార్గనిర్దేశం చేశారు. "వర్షాలు వస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోకుండా అవసరమైన టార్పాలిన్లు, తగిన సదుపాయాలు కల్పించాలి. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా చూడటంతో పాటు, వారికి సకాలంలో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి" అని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాబోయే రోజుల్లో జిల్లాల్లో పర్యటించనున్నారు. సీఎం పర్యటనలను విజయవంతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలి. భద్రతా ఏర్పాట్లు, బహిరంగ సభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి చిన్న లోపాలు కూడా ఉండకూడదు." అని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

# పట్టణ పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- మెరుగైన వైద్య సేవలు అందించాలి
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి
- అచ్చంపేట పట్టణంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలు, ప్రభుత్వ పథకాల క్షేత్రస్థాయి పురోగతిపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం ఉదయం ఆయన అచ్చంపేట పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. పట్టణంలోని పారిశుధ్య పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను స్వయంగా పరిశీలించి, లోపాలను సరిదిద్దాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మొదటగా పట్టణంలోని పలు వార్డుల్లో జరుగుతున్న శానిటేషన్ కార్యక్రమాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. రహదారుల పరిశుభ్రత, తడి-పొడి చెత్త సేకరణ, డ్రైనేజీల నిర్వహణతో పాటు పారిశుధ్య కార్మికుల హాజరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కలెక్టర్ మాట్లాడుతూ... మున్సిపల్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ప్రజారోగ్యానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ పారిశుధ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణంలో ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, డ్రైనేజీ పూడికతీత పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం అచ్చంపేట పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా తమ సొంతింటి కల నెరవేర్చుకుని గృహప్రవేశాలు చేసేలా పనుల్లో వేగం పెంచాలని సూచించారు. నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఇంజనీరింగ్ అధికారులు తక్షణమే అందించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పర్యటనలో భాగంగా అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన కలెక్టర్.. ఓపీ, ఐపీ వార్డులు, ల్యాబ్స్ మరియు ఫార్మసీ విభాగాలను తనిఖీ చేశారు. మందుల లభ్యత, స్టాక్ రిజిస్టర్లు, ఔషధాల గడువు తేదీలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని, కుక్కకాటు, పాముకాటు వంటి అత్యవసర మందులను ఎల్లప్పుడూ నిల్వ ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది ఖచ్చితంగా సమయపాలన పాటించి రోగులకు అందుబాటులో ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్, తహసిల్దార్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# కరాటే శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

- మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- బాలికలు ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** కరాటే శిక్షణ ద్వారా విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వం పెంపొందుతాయని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. వేములవాడ పట్టణంలోని ఒకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించిన కరాటే బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా రంగుల బెల్ట్‌లు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యం కలిగి ఉండాలని, ముఖ్యంగా బాలికలు తమ ఆత్మరక్షణ కోసం చిన్నతనం నుంచే కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీస్తూ, వారిని ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపిస్తున్న ఒకినావా అకాడమీ కరాటే మాస్టర్ గమా మన్నన్ గారికి ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలో క్రీడల ప్రోత్సాహానికి మున్సిపాలిటీ ఎల్లప్పుడూ ముందుంటుందని, ఇలాంటి అకాడమీలకు తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బెల్ట్ ప్రదానోత్సవానికి ముందు విద్యార్థులు ప్రదర్శించిన కరాటే విన్యాసాలు, 'కాటా' ప్రదర్శనలు అక్కడికి వచ్చిన వారిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ నారాల శేఖర్, కరాటే బ్లాక్ బెల్ట్ గ్రహీత అవధూత రజినీకాంత్, అకాడమీ ప్రతినిధులు, కరాటే శిక్షకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీలో భారీ చేరికలు



**పరకాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** పరకాల నియోజకవర్గ రాజకీయాల్లో శనివారం ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ ప్రజావ్యతిరేక వైఖరిని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ... పరకాల రూరల్ మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పార్టీలో చేరిన నూతన నాయకులకు, కార్యకర్తలకు ఆయన కాషాయ కండువాలు కప్పి సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ పార్టీని వీడి కాషాయ గూటికి చేరిన వారిలో వెల్లంపల్లి గ్రామానికి తాళ్ల మురళి, తక్కలపల్లి కిరణ్, బండి శివ, మారబోయిన సదానందం, ఐరాబోయిన స్వామి వీరితో పాటు బొజ్జం వంశీ, ఎండి అంజాద్, గుర్రం నాగరాజు, తక్కలపల్లి మొగిలి తదితరులు బీజేపీలో చేరారు. రాబోయే రోజుల్లో డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు నాయకత్వంలో పరకాలలో బీజేపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పరకాల రూరల్ మండల అధ్యక్షుడు కాసాగాని రాజకుమార్, గీసుకొండ మండల అధ్యక్షుడు కొంగర రవికుమార్, సంగెం మండల అధ్యక్షుడు దామరుప్పుల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం తరలింపు శూన్యం

- లారీ నిలిపేసి డ్రైవర్ మాయం..
- ఫోన్ ఎత్తని కాంట్రాక్టర్
- గంటల తరబడి వేచిచూస్తున్న రైతులు, హమాలీలు



**ఉప్పునుంతల, వాయిస్ ఆఫ్ వందే భారత్:** మండల పరిధిలోని ఉప్పరపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రవాణా అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. శనివారం ఉదయం ధాన్యం తరలింపు కోసం కేంద్రానికి వచ్చిన ఒక లారీని రోడ్డుపైనే నిలిపివేసి, డ్రైవర్ తనకు సంబంధం లేనట్లుగా అక్కడి నుండి వెళ్లిపోవడం తీవ్ర కలకలం రేపింది. సంచుల్లో నింపిన ధాన్యాన్ని లారీలోకి ఎక్కించేందుకు రైతులు, హమాలీలు ఎంతగానో ఎదురుచూశారు. అయితే లారీ డ్రైవర్ క్షేత్రస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో, విసిగిపోయిన రైతులు సంబంధిత లారీ ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌కు ఫోన్ చేశారు. అయినా కాంట్రాక్టర్ నుండి ఎలాంటి సానుకూల స్పందన రాలేదు. మరోవైపు లారీ డ్రైవర్‌కు ఫోన్ చేయగా.. "నేను అక్కడ లేను.. నాకేం తెలియదు" అంటూ బాధ్యతారహితంగా సమాధానం ఇస్తున్నాడని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుండి రైతులు, హమాలీలు లారీ వద్దే గంటల తరబడి వేచి చూస్తూ కాలం గడుపుతున్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వాతావరణం ఎప్పుడు మారుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కష్టపడి పండించి, సంచులలో నింపిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి ముద్దయిపోకముందే మిల్లులకు తరలించాలని రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఐకేపీ కేంద్రాలలో తూకం వేసిన ధాన్యాన్ని తక్షణమే మిల్లులకు చేర్చాల్సిన బాధ్యత రవాణా కాంట్రాక్టర్లదే అయినప్పటికీ.. ఇలాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల తాము నష్టపోవాల్సి వస్తోందని రైతులు మండిపడుతున్నారు. కావున, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, సదరు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని, నిలిచిపోయిన వరి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఉప్పరపల్లి రైతాంగం డిమాండ్ చేస్తోంది.



వాయిస్ ఆఫ్ వందే భారత్
Voice of Vande Bharath
VOICE OF VANDE BHARATH
శనివారం, జూన్ 06, 2026

## 'దోస్త్' అడ్మిషన్ల ముమ్మర ప్రచారం

- మన్ననూర్ గ్రామంలో అధ్యాపకుల ఇంటింటి సర్వే
- జూన్ 15 వరకు దరఖాస్తుకు చివరి గడువు



**అమ్రాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను విద్యార్థుల నమోదును పెంచేందుకు దోస్త్ అడ్మిషన్ల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ కె. గోపాల్ ఆదేశాల మేరకు శనివారం అధ్యాపక బృందం మన్ననూర్ గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించింది. దోస్త్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జూన్ 5 నుంచి ప్రారంభమైందని, ఈ నెల 15 వరకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి గడువు ఉందని ఈ సందర్భంగా అధ్యాపకులు విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించారు. సర్వే సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ... అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. అన్ని సబ్జెక్టులకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో పాటు విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను అందించేందుకు అత్యాధునిక ల్యాబ్ వసతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ప్రభుత్వ కళాశాలలోనే అడ్మిషన్లు పొందాలని కోరారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థుల వివరాలను సేకరించి, వారికి 'దోస్త్' రిజిస్ట్రేషన్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ క్షేత్రస్థాయి ప్రచార కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మల్లయ్య, రమేష్, ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డైలీ వేజ్ వర్కర్లకు సమాన వేతనాలు అమలు చేయాలి

- అచ్చంపేట సమావేశంలో కార్మికులు
- మంత్రుల హామీలు నెరవేర్చకపోతే ఉధృత ఉద్యమం
- ఒకే శాఖ.. ఒకే పని.. జిల్లాకో రకం వేతనాలా?
- 10న హైదరాబాద్ రాష్ట్ర సదస్సుకు తరలిరావాలని పిలుపు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ యూత్ ట్రైనింగ్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్మికుల విస్తృత స్థాయి సమావేశంలో వర్కర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై సుదీర్ఘంగా చర్చించి, పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ.. గతంలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 45 రోజుల పాటు సుదీర్ఘంగా సమ్మె నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ సమయంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి, సదరు శాఖ కమిషనర్ నేతృత్వంలో జేఏసీ నాయకులతో చర్చలు జరిపారని తెలిపారు. మూడు నెలల వ్యవధిలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని, "సమాన పనికి సమాన వేతనం" సూత్రం ప్రకారం వేతనాల పెంపునకు కార్యాచరణ రూపొందిస్తామని లిఖితపూర్వకంగా హామీ ఇచ్చి, ఇప్పటివరకు దాన్ని బుట్టదాఖలు చేయడంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాల్లో గిరిజన సంక్షేమ శాఖ డైలీ వేజ్ వర్కర్లకు కలెక్టర్ గెజిట్ ప్రకారం రూ.26,700 వరకు వేతనం అందుతుండగా, నాగర్‌కర్నూల్ జిల్లాలో మాత్రం పాత జీవో నెం.64 సాకుతో కేవలం రూ.11,700 మాత్రమే చెల్లించడం తీవ్ర వివక్షకు నిదర్శనమని విమర్శించారు. ఒకే శాఖలో, ఒకే విధమైన పనులు నిర్వహిస్తున్న కార్మికులకు వేర్వేరు వేతనాలు చెల్లించడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం కోసం రాత్రింబవళ్లు సేవలందిస్తున్న తమకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకపోవడం వల్ల కుటుంబాల పోషణ అత్యంత భారంగా మారిందని కార్మికులు కన్నీరుమున్నీరయ్యారు. పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు, ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన పెరిగిన కార్మిక వేతన జీవోలను తమకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మంత్రి ఇచ్చిన పాత హామీలను నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డైలీ వేజ్ వర్కర్లందరినీ ఏకం చేసి ఉధృత ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. ఇందులో భాగంగా జూన్ 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న 'డైలీ వేజ్ వర్కర్ల రాష్ట్ర సదస్సు'కు నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి వర్కర్లు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల సురేందర్, రాష్ట్ర నాయకులు దామోదర్, వెంకటేష్, రాంజీ, నాగర్‌కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి హోం ప్రకాష్, ఉపాధ్యక్షుడు ఎల్లమ్మ సుధాకర్, కార్మికులు బాలమణి, చెన్నమ్మ, బుజ్జి, పద్మ, నీల, లక్ష్మి, సుజాత, షహీన్ బేగం, రాములమ్మ, లింగమ్మ, రామ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

## జీనుకుంట గ్రామసభలో కలెక్టర్ మానవత్వం

- వృద్ధుడిని ఆప్యాయంగా పలకరించిన హేమంత కేశవ్ పాటిల్
- గోరంట్ల సంజన్న యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న జిల్లా కలెక్టర్
- ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలు విన్న వైనం



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలనే లక్ష్యంతో నిర్వహించిన గ్రామసభలో నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తన మానవీయ కోణాన్ని చాటుకున్నారు. బల్మూరు మండలంలోని జీనుకుంట గ్రామంలో శనివారం నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభకు వచ్చిన గ్రామస్తులతో ఎంతో సాదాసీదాగా మమేకమై వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామసభలో పాల్గొనేందుకు వచ్చిన 80 ఏళ్ల గోరంట్ల సంజన్న అనే వృద్ధుడిని చూసిన కలెక్టర్, స్వయంగా ఆయన వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. సంజన్న చేతులు పట్టుకుని ఆయన ఆరోగ్య పరిస్థితి, కుటుంబ పరిస్థితులపై ఆరా తీశారు. "తాతా.. ఆరోగ్యం బాగుంటుందా? ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్ సక్రమంగా ప్రతి నెల అందుతుందా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా?" అని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వయోభారంతో సంజన్న పడుతున్న ఇబ్బందులను కలెక్టర్ ఎంతో శ్రద్ధగా విన్నారు. అనంతరం అక్కడే ఉన్న సంబంధిత అధికారులను పిలిచి, వృద్ధులకు అవసరమైన ప్రభుత్వ సేవలు, వైద్య సాయం ఎల్లప్పుడూ సకాలంలో అందేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన వర్గాల, వృద్ధుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. గ్రామసభలో పాల్గొన్న ప్రజలతో కలెక్టర్ ఆత్మీయంగా ముచ్చటిస్తూ గ్రామాభివృద్ధి, తాగునీటి సరఫరా, అంతర్గత రహదారులు, విద్యుత్, పారిశుధ్యం మరియు సంక్షేమ పథకాల అమలు తీరుపై వారి అభిప్రాయాలను సేకరించారు. ప్రజలు తమ సమస్యలను ఎలాంటి భయం లేకుండా నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తాము కట్టుబడి ఉన్నామని భరోసా ఇచ్చారు. గ్రామసభలో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ వృద్ధుడిపై చూపిన ఆప్యాయత, ప్రజల సమస్యలపై ప్రదర్శించిన శ్రద్ధ గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఒక ఉన్నతాధికారి తమ మధ్యకు వచ్చి సామాన్యుడిలా మాట్లాడటం పట్ల జీనుకుంట గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, రెవెన్యూ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం, స్వీట్ల పంపిణీ



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్:** "అన్నపూర్ణే! సదాపూర్ణే! శంకర ప్రాణ వల్లభే!" అనే శ్లోక స్ఫూర్తితో మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో సాగుతున్న నిత్య అన్నదాన కార్యక్రమం శనివారం నాటికి విజయవంతంగా 1883వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా శనివారం రాజన్న ఆలయ పరిసరాల వద్ద సుమారు 100 మంది భక్తులకు, పేదలకు ట్రస్ట్ సభ్యులు అన్నదానంతో పాటు స్వీట్లను పంపిణీ చేశారు. పలువురు దాతలు తమ కుటుంబ సభ్యుల పుట్టినరోజుల సందర్భంగా ఈ సేవకు ఆర్థిక సహాయం అందించారు. సామాజిక సేవాకర్త విక్కుర్తి లక్ష్మీనారాయణ-సూర్యకళ దంపతులు, విశాల షాపింగ్ మాల్ అధినేత చౌటపల్లి శ్రీకాంత్-సంధ్య దంపతులు మరియు వారి కుమార్తెలు దీక్షిత, సహస్ర. అలాగే మీడియా మిత్రులు మహమ్మద్ రఫీ మరియు కుటుంబ సభ్యులు, ఉప్పుల దేవరాజు-పద్మ దంపతులు. శాశ్వత అన్నదాతలు: డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు-స్నేహలత దంపతులు, ప్రతాప స్వప్న-సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్-జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ-సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ-బాలచందర్ రాజు దంపతులు. హైదరాబాద్ దాతలు: రామడుగు శ్రీలత (కుమారులు, కోడళ్లు: ప్రజ్ఞ-శరత్చంద్ర, శిరీష-సాయిచంద్ర, శర్వాణి-రవిచంద్ర దంపతులు) మరియు చిన్నారులు శ్రీహర్ష, సాయి కృష్ణ. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు మధు, మహేష్ మాట్లాడుతూ.. తమ కుటుంబాలలో జరిగే పుట్టినరోజులు, పెళ్లిరోజులు లేదా ఇతర శుభకార్యాల జ్ఞాపకార్థంగా పేదలకు, అన్నార్తులకు ఒక పూట అన్నదానం చేయాలనుకునే దాతలు ఎవరైనా ముందుకు రావచ్చునని కోరారు. ఆసక్తి గలవారు ట్రస్టు సభ్యులను నేరుగా కానీ, లేదా 92469 39388 మొబైల్ నంబరు ద్వారా కానీ సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.ఈ అన్నదాన కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు, మహేష్, పసుల శ్రీనివాస్, మహమ్మద్ అబ్దుల్ రఫీక్, మధు కవిత, గొట్టం శ్రీనివాస్ తదితరులు పాల్గొని స్వహస్తాలతో భోజనాలు వడ్డించారు.

